క్లుప్తంగా

'గరిమెళ్ల'కు ఘననివాళి



విజయవాడకల్చరల్: అన్నమయ్య కీర్తనలను గానాభిషేకం చేసిన మహనీయుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అని పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు కొనియాడారు. క్రామేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీపీఠం, బ్రహ్మానందరావు కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సకల కళావేదిక కార్యాలయంలో శుక్రవారం గరిమెళ్ల సంస్మరణ సభను నిర్వహించారు. గరిమెళ్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ అన్నమయ్య పదం పల్లెపల్లెకు చేరడంలో గరిమెళ్ల కృషే కారణమన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌తో అనుబంధం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు, డేవిడ్‌రాజు, వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు, యోకోబ్, బీవీ వీరభద్రరావు తదితరులు పాల్గొని గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు నివాళులర్పించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీఅయ్యప్పస్వామి మందిరంలో శుక్రవారం శ్రీమణికంఠ సోషల్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. లోక కళ్యాణార్థం 18దివ్య ద్రవ్యములతో కలశ అభిషేకం, సహస్రనామార్చన, హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి మూల మంత్ర హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం వేళ బల్లెం పూర్ణయ్య గురుస్వామి, శ్రీనివాసరావు భవాని కలిసి అయ్యప్పకు అన్నాభిషేకం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. సుమారు రెండు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి స్వామివారి ప్రసాదంను స్వీకరించారు.

150 మందికి వైద్యపరీక్షలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని తొండపు హనుమంతరావు ట్రస్ట్ చైర్మన్ తొండపు హనుమంతరావు సూచించారు. స్థానిక గవర్నర్‌పేట రామ్మోహన గ్రంథాలయం ఆధ్వర్యాన వాసన్ ఐ కేర్, మణిపాల్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. హనుమంతరావు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు అవసరమైనవారికి తమ ట్రస్టు ద్వారా ఉచితంగా చేయించనున్నట్లు తెలిపారు. వాసన్ ఐకేర్ సిబ్బంది కంటి పరీక్షలు మణిపాల్ హాస్పిటల్ సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరంలో గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, సహాయ కార్యదర్శి తంగిరాల రఘురాం, కమిటీ సభ్యులు కోటా కృష్ణభగవాన్, చిదంబరం, పవన్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయలక్ష్మికి ఘనసత్కారం



విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సామాజిక సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఐవోసీ అధికారి బీవీ వీరభద్రరావు అన్నారు. ఇటీవల విశిష్ట మహిళా పురస్కారాన్ని అందుకున్న విజయలక్ష్మికి సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాయలంలో శుక్రవారం అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ విజయలక్ష్మి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 18 వందలకు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం ద్వారా సేవలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, కే డేవిడ్‌రాజు, పైడిపాటి వెంకన్న, మల్లీశ్వరి, ఝాన్సీ, చలపతి, చంద్రశేఖర్, సునీల్, ఆదాం తదితరులు విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. సన్మానగ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం మరింత కృషిచేస్తానని వివరించారు.

బెజవాడ వ్యర్థం.. ఏలూరుకు తీర్థం

- కాలుష్యం బారిన ఏలూరు కాలువ
- కాల్వలోకి మురుగు, సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



మురికికూపంగా ఉన్న ఏలూరు కాలువ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని బుడమేరుతోపాటు ఏలూరు, రైవస్ కాలువలు కలుషితమవుతున్నాయి. నగరవాసులు ఎవరికి వారు తమ ఇళ్లలోని మురుగు, సెప్టిక్ వ్యర్థాలను యథేచ్ఛగా కాలువలోకి వదలివేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు, పాలకులు మాత్రం ఈ విషయంపై తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రమాదకరమైన సెప్టిక్ వ్యర్థాలు సైతం పైపుల ద్వారా కాలువలు, బుడమేరులో కలుస్తున్నాయి. అలాగే పరిసర ప్రాంత వాసులు తమ వ్యర్థాలు, చెత్తచెదారాన్ని సైతం ఇష్టారాజ్యంగా బుడమేరు, కాల్వల్లో వేస్తున్నారు. దీంతో బుడమేరు, కాలువలు వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుండటంతోపాటు దోమలకు అవాసకేంద్రంగా మారాయి. ఆయా కాల్వలు కలుషితం కాకుండా చూడాల్సిన చూడాల్సిన అధికారులు కేవలం వంతెనల వద్ద మెస్‌లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.


నగరం మీదుగా ప్రవహించే ఏలూరు కాలువ నీటిని దిగువప్రాంత వాసులు తాగు, సాగునీటి అవసరాలకు వినియోగిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన నీటిని సైతం నగరవాసులు కలుషితం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కాలుష్యంగా మారిన ఏలూరు కాలువ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నందున అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అలాగే ఈ నీటిని సాగు అవసరాలకు వినియోగిస్తుండటంతో కలుషిత నీటి కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుమయ్యే ప్రమాదం ఉంది.

కాలువలకు మోక్షం ఎప్పుడో...

అధికారులు, పాలకులు ఎప్పటికప్పుడు బుడమేరు, కాలువలు ప్రక్షాళన చేస్తామని చెప్పటమే తప్ప చేసిందేమీ మాత్రం ఏమిలేదు. మురుగునీటి కనెక్షన్‌లను కాలువలు, బుడమేరులో వదలివేసే వారి విషయంలో కార్పొరేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం కూడా ఈ సమస్యకు ప్రధాన కారణం. అధికారులు కనీస చర్యలు సైతం చేపట్టకపోతుండటంతో కాలువలు కలుషితమైపోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కాలువలు కలుషితం కాకుండా వంతెనల వద్ద మెస్‌లను మాత్రం ఏర్పాటు చేశారు.

రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలి..

బుడమేరు, ఏలూరు, రైవస్ కాలువల ప్రక్షాళనకు రిటైనింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అప్పుడు మాత్రమే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొంటున్నారు.



ఇళ్ల నుంచి కాలువలోకి ఏర్పాటు చేసిన సెప్టిక్, మురుగు పైపులు

పటిష్ట చర్యలు చేపట్టాలి...



కాలువ పక్కన నివసిస్తున్న వారికి యూజీడీ కనెక్షన్లు ద్వారా మురుగు, సెప్టిక్ వ్యర్థాలు కాలువలోకి వెళ్లకుండా చూసుకునే అవకాశం ఉంది. అలాగే నగరపాలక సంస్థకు సైతం అదనపు ఆదాయం సమకూరుతుంది.ఆ దిశగా చర్యలు తీసుకుంటే కాల్వలు కలుషితంగా కాకుండా చూడవచ్చు.

–పి.కృష్ణమూర్తి, సీపీఎం నాయకులు, మధురానగర్

రిటైనింగ్ వాల్ నిర్మించాలి...



కాలువ, బుడమేరు పక్కన నివసిస్తున్న వారందరికీ కృష్ణా జలాలు పంపిణీ చేయడంతో పాటు యూజీడీ కనెక్షన్లు ఇవ్వాలి. కాలువలు, బుడమేరు పక్కన రీటైనింగ్ వాల్ నిర్మించాలి. ఇటీవల వరదల సమయంలో కృష్ణానది రిటైనింగ్ వాల్ ఎంత ప్రయోజనకరంగా ఆదుకుందో అధికారులు గుర్తించాలి.

–ఎస్‌కె షకీలా, సీపీఎం నాయకురాలు, బుడమేరు మధ్య కట్ట

రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ఆక్రమణలు తగ్గడంతోపాటు మురుగు, యూజీడీ వ్యర్థాలు కాలువలు, బుడమేరులోకి తరలించే అవకాశాలు తగ్గుతాయి. ఆదిశగా పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : మల్లాది



మల్లాది విష్ణును సత్కరిస్తున్న ముస్లిం సోదరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక నేతాజీ కాలనీలో శుక్రవారం సాయంత్రం నేతాజీకాలనీ అర్షదుల్లా యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణు, ముస్లిం సోదరులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు కఠోర దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలయజేశారు. సోదర భావంతో మెలగాలని కలిసి మెలసి పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం యువకులు మల్లాది విష్ణును దుశ్శాలువ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌కే బాబు, అక్బర్, చాంద్‌బాషా, నాగూర్‌బాషా, గౌస్‌బాషా, జురూర్, ఇబ్రహీం, మహమ్మద్, బాషా పాల్గొన్నారు.

కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): వీఎంసీ లో శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్న ఓ మహిళపై నలుగురు మహిళలు దాడిచేసినట్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు...ముత్యాలంపాడుకు చెందిన శానిటరీ వర్కర్ కర్నాటి రాణి ప్రకాష్‌నగర్, దుర్గా బార్ వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తుండగా..ఇందు అనే మేస్త్రీ, ఆమె అక్కచెల్లెల్లు నలుగురు కలిసి మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితురాలు రాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా హోలీ సంబరాలు



హోలీ సంబరాలలో ఎంఎం నాయక్, కమిటీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఏటా కుటుంబసభ్యులతో కలిసి హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని సాంఘిక సంక్షేమ, గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ అన్నారు. బంజారా హోలీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ లో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వేషధారణ, నృత్యాలతో మహిళలు సందడి చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి హోలీ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. మహిళలు బంజారా వస్త్రాలతో చేసిన నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. బంజారా సంస్కృతి సంప్రదాయాలను భవిష్యతతరాలకు జేయాలనే సదుద్దేశ్యంతో ఏటా ఈ ఉత్సవాలను నిర్వహిటాస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘం అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బంజారాలకు నగరంలో బంజారా భవన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ బి. రాంబాబు, ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ డెప్యూటీ డైరెక్టర్ వి.హనుమనాయక్, డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఎ.బుద్ధయ్య నాయక్ కమిటీ సభ్యులు రఘుపతి, భానుబాబు, వాసునాయక్, కృష్ణానాయక్, బి.శ్రీనివాస్, బి.రమణనాయక్ పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరవాసులు శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా పరస్పరం రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా హోలీ జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ మిఠాయిలు పంచుతూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఇందిరా ఎన్‌క్లేవ్‌లో హోలీ వేడుకల్లో యువకులు

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు):ఈఏడాది ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నందున ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని శ్రీఅభయ హస్త సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత అభయ హస్త అయ్యప్పస్వామి వారి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అవినాష్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామివారి దీవెనలు ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రార్థించారు. అనంతరం స్థానికులకు మజ్జిగను పంపిణీ చేశారు.కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి విషయంలో మోడల్ నియోజకవర్గంగా చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అమృత్ 20 ఇన్సింటివ్ నిధులు రూ.7కోట్లతో 63, 64డివిజన్లలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన స్థానిక రాజీవ్‌నగర్ కట్ట వద్ద శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాల్వల పనులు పూర్తయితే భవిష్యత్‌లో ఎలాంటి వరదలు సంభవించినా ఈ ప్రాంతాలకు వరద భయం ఉండదన్నారు. డ్రైనేజీ కాల్వల ద్వారా మురుగు కంద్రిక పంపింగ్ స్టేషన్ నుంచి నేరుగా 33 తూముల వరకు వెళ్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణరావు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం రూ.22కోట్లు మంజూరు చేయించినట్లు వివరించారు. డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, మోదుగుల తిరుపతమ్మ, పార్టీ నాయకులు బత్తుల కొండ, వైకుంఠం, ఖాశీమ్, రవికుమార్, పైడిశ్రీను, సీహెచ్.రవి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసరెడ్డి, డీఈ లక్ష్మీ సింధూర తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : కలెక్టర్



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందజేస్తున్న కలెక్టర్ ఎంపీ కేశినేని శివనాథ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు) : విభిన్న ప్రతిభాంతులు కన్న కలలను సాకారం చేసుకోడానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్స్, ట్రైసైకిల్స్, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ల్లా కలెక్టర్ లక్ష్మిశ హజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మిశ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో సమర్ధవంతంగా అమలు చేస్తానని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి మూడునెలలకు ఒకసారి కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడ సెంట్రల్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలోని 750 మంది విభిన్నప్రతిభావంతులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

'ప్రయాణం' గ్రంథావిష్కరణ



విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ నూకతోటి రవికుమార్, అజయ్ మేడేపల్లి, కాసుల రవికుమార్, మల్లవరపు ప్రభాకరరావు సంయుక్తంగా రచించిన 'ప్రయాణం' యాత్రా సాహిత్యం గ్రంథాన్ని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సాహిత్యంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రచయితలు నలుగురు తమ సాహిత్య జీవితానికి సంబంధించి వారు ఎదుర్కొంటున్న సంఘటనలు, సాహితీవేత్తలతోపాటు ఇతర ప్రాంతాలను దర్శించిన సందర్భాలకు అక్షర రూపమిచ్చినట్లు వివరించారు. యాత్రా సాహిత్యం ప్రధానంగా వారి సాహిత్యజీవనానికి సంబంధించిన అనేక విషయాలను వివరించినట్లు తెలిపారు. యువ కవి అనిల్ డ్యాని మాట్లాడుతూ రచయితల కృషిని అభినందించారు. తొలి ప్రతిని సాహితీవేత్త కె.శోభారాణి స్వీకరించారు. గ్రంథాన్ని కథా రచయిత డాక్టర్ జడ సుబ్బారావు సమీక్షించారు. వివిధ రంగాలకు చెందిన కేవీ కృష్ణయ్య, వి.వెంకటేశ్వరరావు, గడ్డం సుబ్బారావు, శిఖా ఆకాష్ ప్రసంగించారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న లలితా చంద్రశేఖర్, వాద్య సహకారం అందిస్తున్న బీవీ దుర్గాభవాని, శ్రీధర్

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్య సేవాసంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం నిర్వహించిన కర్నాటక గాత్ర సంగీత సభ సుమధురంగా సాగింది. గాయని లలితాచంద్రశేఖర్ శ్రీరాగం వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన గణపతే, హిరణ్మయీం లలితాం, ఓగిరాల వీరరాఘవశర్మ రచించిన నేడే నను సేవింప, త్యాగరాజస్వామి కీర్తన బ్రోచేవారెవరే, అన్నమాచార్య సంకీర్తన ధర్మవతి, జయదేవుని అష్టపది అనిల తరళ, రామదాసు కీర్తన రామభద్ర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవానీ, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ వాద్య సహకారం అందించారు. స్వరఝరి సంస్థ అధ్యక్షులు తాడిమేటి సీతారామచంద్రమూర్తి సంతాప సభను కూడా ఇదే వేదికమీద నిర్వహించారు. సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ రామచంద్రరావు సంస్థకు చేసిన సేవలను వివరించారు. అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

● చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా సారవకోట బద్రి గ్రామానికి చెందిన బలగ రమణయ్య, పద్మలు భార్యాభర్తలు. జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో భార్యాభర్తలిద్దరూ నిద్రపోయారు. రెండు గంటల సమయంలో రమణయ్యకు మెలుకువ వచ్చి చూడగా పద్మ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● అరుణ వర్ణంలో జాబిల్లి



పండు వెన్నెలలు కురిపించే చందమామ నిండు పున్నమి రోజు మండే సూర్యుడిలా అరుణ వర్ణంలో తారసిల్లింది. చల్లని జాబిల్లి బ్లడ్ మూన్‌లా అగుపడింది. విజయవాడ సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ఆకాశంలో చందమామ ఎర్రని అకృతిలో కనువిందు చేస్తున్న దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో ఇలా బంధించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేత్రపర్వంగా పద్మావతి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాలక్ష్మీ జన్మనక్షత్రమైన ఉత్తరఫల్గుణి నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శాశ్వత ఉభయదాతల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పీ రామచంద్రమూర్తి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

కన్నుల పండువగా గరుడోత్సవం..

పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వారి గరుడోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను గరడ వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని ఆలయంలో మూడు సార్లు ప్రదక్షిణగా ఊరేగించారు.

బంగారం కనిపించడం లేదంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీరువాలో పెట్టిన 20గ్రాముల బంగారపు చైను, ఉంగరాలు, చెవిదిద్దులు కనిపించడం లేదంటూ శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి సెంటర్ బాపూజీ వీధిలో అనిత పోతురాజు నివసిస్తున్నారు. గతనెల 19వ తేదీన అనిత సోదరి, ఆమెకుమార్తె చీరాల నుంచి కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చారు. అప్పుడు అనిత తన బంగారంను బీరువాలో పెట్టారు. అనిత సోదరి ఈనెల 13వ తేదీన తిరిగి చీరాల వెళ్లిపోయారు. ఈక్రమంలో అవసరం నిమిత్తం బీరువా తెరిచి చూడగా అందులోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించ లేదు. దీంతో అనిత స్థానిక అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 17న భవానీపురం స్వాతీ సెంటర్ మసీదు రోడ్‌లోని రజా మసీదు ప్రాంగణంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ ఆఫీస్ వద్ద ఉచిత నేత్ర వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ఆ హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వీ రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరంలో కొనసాగుతుందని వివరించారు.